
# వీర నాట్యం

దక్ష యజ్ఞమప్పడు దక్షుడు తన కుమార్తె అయిన సతీదేవిని అల్లుడయిన పరమేశ్వరులను ఆహ్వానించలేదు. ఈశ్వరుని భార్య సతీదేవి పిలవనిపేరంటానికి వెళ్లవద్దని భర్తవారించినా తండ్రిచేయు యజ్ఞానికి వెళుతుంది. అక్కడ దక్షుడు సతీదేవి ఎదురుగా ఈశ్వరుని అవమానంగా మాట్లాడుతాడు. ఆ అవమానం తట్టుకొనలేక ఆవిడ అక్కడే అగ్ని పేర్చుకొని ఆహుతి అయిపోతుంది. ఈ విషయం ఈశ్వరుడు తెలుసుకొని కోపోద్రేకుడై తనఝుటాఝూటాన్ని నేలకేసికొట్టి వీరభద్రుడిని సృష్టించి "వీరభద్రా నీ తల్లిని అవమానపరచినవాని తలను నరికిరమ్ము" అని ఆదేశిస్తారు. శివుని ఆదేశం మేరకు దక్ష సంహారంచేయటానికి వీరభద్రస్వామి నాట్యంచేస్తూ బయలుదేరుతాడు. సంహారానికి వెళ్లేటప్పడు వీరభద్రుడు తనవెంట వీరకుమారులు వీరనాట్యం చేస్తూ వెళ్లి ఆ దక్షుణ్ణి సంహరించి తిరిగివచ్చి ఈశ్వరుడిని దక్షసంహారం జరిగినట్లు తెలియపరుస్తాడు. ఆ వీరకుమారులు చేసే నాట్యమే వీరనాట్యం.



వీరావేశంతో చేసే నాట్యకళారూపమే ఈ వీరనాట్యం. వీర శైవానికి సంబంధించిన అన్ని జానపదకళారూపాలలో కల్లా ఈ వీరనాట్యం చాలా కష్టతరమైన కళారూపం. శివతాండవం నృత్యంలోని 108 కరణాలు ఇందులో ఉన్నవి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో వీరశైవం వ్యాప్తిచెందియున్న జిల్లాలన్నింటిలోనూ వీరనాట్యం ఉండుట గమనించవచ్చు. ముఖ్యంగా తూర్పుగోదావరిజిల్లా, పశ్చిమగోదావరిజిల్లా, కర్నూలు, అనంతపురం, ఖమ్మం జిల్లాలలో వీరనాట్యానికి మంచిప్రచారంలో ఉన్నది. శివరాత్రి రోజున లింగోద్భవసమయంలో వీరు "ఊర్ధ్వతాండవం" చేసెదరు. నాలుకకు శూలాన్ని

గుచ్చుకొని శూలానికి నూనెవత్తులు వెలిగించి వాద్యాలకనుగుణంగా వీరావేశంతో వీరనాట్యం చేస్తారు. ఈ నాట్యంలో వీర రసానికి ఎక్కువ ప్రాధాన్యతుంది. ఇటువంటి వీరులు ఉన్నదేశమే శత్రుదేశాలనుండి సంరక్షించుకొనుటకు కావలసిన శక్తికలది అయి ఉండును. వీరనాట్యం మనిషిలోని వీర రసాన్ని పెంపొందించుటకు తద్వారా దేశప్రజలలో దేశభక్తి, పౌరుషం పెంపొందించుకొనుటకు ఎంతో ఉపయోగపతుంది.

తూర్పుగోదావరిజిల్లా ద్రాక్షారామంలో పూర్వం దక్షుడు చేసిన యజ్ఞగుండం ఇప్పటికీ ఉంది. యిప్పటికీ యాత్రికులు చూస్తూవుంటారు. పూర్వము వీరముష్టి అనే కులానికి చెందినవారు ఈ నాట్యం చేసేవారు. దరిమిలా దేవాంగుల కులంవారు నేర్చుకొని చేస్తున్నారు. ప్రస్తుతము వీరముష్టి మరియు దేవాంగులకులంవారు ఈ నాట్యాన్ని చేస్తున్నారు.

**వీర నాట్యంలో ఈక్రింది దండకాలు ఉంటాయి.**

1. దక్షయజ్ఞం
2. శరభావతారం
3. శ్రీ వీరభద్ర దండకం
4. శ్రీ వీరకుమార దండకం

**వాద్యాలు :**

డోలు, సన్నాయి, తాషా, వీరంగం, తంబురుప మొదలగు వాద్యాలుతో 15 మంది నాట్యం చేస్తారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో సుమారు 8 వీర నాట్యం బృందాలు ఉన్నవి. వీరిని శివరాత్రి సందర్భంగా, కర్తీకమాసం, మాఘమాసం, పెళ్ళిళ్లకు ముందు దేవునికి బోనంపోసేటప్పుడు పిలుస్తారు. వీరి ప్రదర్శన ఆరు గంటల సేపు వుంటుంది. ఆంధ్రప్రదేశంలో సుమారు 200 మంది కుటుంబాలు ఈ కళపై ఆధారపడి ఉన్నవి.